సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

మోస్రా(చందూర్), డిసెంబర్ 24: మోస్రా మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. బాన్సువాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మోస్రా, చింతకుంటకు చెందిన ఒక్కొక్కరికి, గోవూర్‌కు చెందిన ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మోస్రా మండల అధ్యక్షుడు పిట్ల శ్రీరాములు, హన్మంత్ రెడ్డి, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

నాగపూర్‌లో..

బాల్కొండ, డిసెంబర్ 24: మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన ధోన్‌పాల్ నవీన్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.52 వేల విలువైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బాధితులు, నాయకులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వినాయక్‌నగర్, డిసెంబర్ 24: మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఐదో టాణా పరిధిలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై గంగాధర్ మంగళవారం వెల్లడించారు. నగర శివారులోని రాజీవ్ గృహకల్పలో నివసించే సాప భరత్(28) మద్యానికి బానిసయ్యాడు. అప్పుల పాలైన అతడు జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

28న 'ఇందూరు యువత' వార్షికోత్సవం

సుభాష్‌నగర్, డిసెంబర్ 24: ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 28న స్థానిక రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 'పరిమళించిన మానవత్వపు త్రోవలో– 2024' వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు సాయిబాబు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వినాయకనగర్, డిసెంబర్ 24: నిజామాబాద్ నగరంలోని రెండో పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం మంగళవారం తీర్పు వెలువరించారని ఏసీపీ రాజా వెంకటరెడ్డి తెలిపారు. నగరంలోని సంతోష్‌నగర్‌కు చెందిన కట్ట నరేందర్, నవీపేట్ మండలం యంచ గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీకాంత్, నగరంలోని హస్మీ కాలనీకి చెందిన షేక్ అష్రఫ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. వీరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా.. ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారని ఏసీపీ వివరించారు.

జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ ఏర్పాటు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 24: వినియోగదారుల సౌకర్యార్థం ప్రభుత్వం జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. వినియోగదారులు న్యాయ సేవల కోసం 1915 లేదా 8800001915కు వ్యాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఇందూరు కంజ్యూమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్ తెలిపారు. హెల్ప్‌లైన్‌కు సంబంధించిన పోస్టర్లను నగరంలో మంగళవారం ఆవిష్కరించారు.

తెలుగు భాష విశిష్టమైనది

- చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సూర్య ధనుంజయ
- టీయూలో ముగిసిన తెలుగు అధ్యాపకుల పునఃశ్చరణ తరగతులు

ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ

డిచ్‌పల్లి, డిసెంబర్ 24: దేశ భాషల్లో తెలుగు భాష విశిష్టమైనదని, పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రభావంతో తెలుగు భాష కొంత వెనుకబడుతున్నదని భావించినప్పటికీ అలా జరగలేదని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (భారతీయ భాషా విభాగాల సంస్థ, మైసూర్), రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా టీయూలో తెలుగు అధ్యాపకులకు నిర్వహిస్తున్న పునఃశ్చరణ తరగతులు మంగళవారం సాయంత్రం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ సూర్యధనుంజయ హాజరై మాట్లాడారు. ఇటీవలి కాలంలో మంచి రచనలు రావడం, విద్యార్థులు, అధ్యాపకులు తెలుగు భాషపై ఆసక్తి చూపడం హర్షించదగిన విషయమన్నారు. ప్రాథమిక స్థాయిలో భాషోపాధ్యాయులు ఈ పునఃశ్చరణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలతో విద్యార్థులకు మంచి విజ్ఞానాన్ని అందించాలని సూచించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కంపా వెంకటరామయ్య 'ఈ–తెలుగు' అనే అంశంపై మాట్లాడుతూ.. ఇంటర్నెట్‌లో తెలుగు భాష వినియోగం, సాహిత్యం ఎలా వస్తున్నది..? వాటిని ఉపయోగించుకునే పద్ధతులను వివరించారు. ఇంటర్నెట్‌లో తెలుగు బ్లాగ్‌లో ఏ విధంగా రాయాలో అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ ఎస్వీ సుబ్రహ్మణ్య మాధవ శర్మ మాట్లాడుతూ గిరిజన భాషలు ఎలా సేకరించాలి..? వాటిని ఎలా భద్రపర్చాలి..? వాటికి లిపి లేనందున కొత్త తరాలకు ఎలా అందించాలనే విషయాలను వివరించారు. ఎరుకల భాషపై చేసిన పరిశోధనను అధ్యాపకులకు తెలిపారు. టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మాట్లాడుతూ.. టీయూలో తెలుగు అధ్యాపకులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ తరగతులను అధ్యాపకులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు చక్కగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (మైసూర్) ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేశ్, టీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, లావణ్య, లక్ష్మణచక్రవర్తి, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

నాటు వేస్తున్న విద్యార్థులు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 24: జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సెయింట్ జేవియర్స్ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి నాటు వేయించారు. విద్యార్థులకు రైతు కష్టపడే తీరు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ లతాగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోనాలు తీసి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఆందోళన చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కంఠేశ్వర్, డిసెంబర్ 24: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మె మంగళవారం 15వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా బోనాలను ఎత్తుకొని నిరసన తెలిపారు. మహిళలు బోనాలు ఎత్తుకోగా.. దీక్షా స్థలం నుంచి పోచమ్మ ఆలయం వరకు డప్పు చప్పుళ్లతో బోనాల ఊరేగింపును నిర్వహించారు. పోచమ్మకు చీర, పూలతోపాటు నైవేద్యం సమర్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి మనసు కరిగించి, తమ డిమాండ్లను పరిష్కరించేలా చూడాలని పోచమ్మను వేడుకున్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, భూపేందర్‌తోపాటు విజయ్, గంగామణి, విద్యాసాగర్, రవికిరణ్, పుష్ప, పవిత్ర, స్వర్ణకుమారి, గంగాధర్, అఫ్సర్, రాణి, సుప్రజ, నగేశ్‌గౌడ్, రాజన్న, ప్రకాశ్, మోహన్, రమేశ్, నవీన్, గిరీశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాలకృష్ణ

ధర్పల్లి, డిసెంబర్ 24: ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. మండలంలోని మరియాతండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, వంట సరుకులను తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలతో ఎంపీడీవో మాట్లాడారు. వారికి అందుతున్న పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అంగన్‌కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాల సాహిత్యం అమూల్యమైనది

'కవన కుసుమాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

సుభాష్‌నగర్, డిసెంబర్ 24: విద్యార్థులలో దాగి ఉన్న సృజనశక్తిని, అంతర్గత ప్రతిభను వెలికి తీసే విధంగా ప్రోత్సహించే బాల సాహిత్యం అమూల్యమైనదని వక్తలన్నారు. బోర్గాం లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో స్వర్ణ లక్ష్మణరావు సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణ సమత సంపాదకత్వంలో కాలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన 'కవన కుసుమాలు' కవిత సంకలనం పుస్తకావిష్కరణ సభను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలసాహిత్యం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి విద్యార్థులకు భాషా నైపుణ్యం పెంపొందించడానికి, నైతిక విలువలను కలిగించడానికి దేశభక్తి, దైవభక్తి కోసం బాలసాహిత్యం ఎంతో దోహద పడుతుందని అన్నారు. ప్రముఖ కథా రచయిత దారం గంగాధర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో బాల సాహిత్యానికి కృషి చేయాలని, అందుకు తల్లిదండ్రులు, భాష ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. రచయిత్రి స్వర్ణ సమత, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, భారతీ తదితర కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

టీయూలో ఇంటర్ కాలేజీ ఖోఖో జట్టు ఎంపికలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాలకిషన్

డిచ్‌పల్లి, డిసెంబర్ 24: ఇంటర్ కాలేజీ ఖోఖో సెలక్షన్స్ – 2024ను తెలంగాణ యూనివర్సిటీ ప్లే గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 50మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారిని తమిళనాడులో ఈనెల 27నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో మెన్స్ టోర్నీకి పంపించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ బీఆర్ నేత, ఫిజికల్ డైరెక్టర్లు బాలమణి, అనిల్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ టీచర్‌పై కేసు నమోదు

వినాయక్‌గర్, డిసెంబర్ 24: నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయినట్లు సమాచారం. స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని తరగతి గదిలో తోటి విద్యార్థుల ఎదుట ఉపాధ్యాయుడు అవమానకరంగా మాట్లాడాడు. దీంతో ఆ విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ఖోఖో పోటీలకు పిప్రి విద్యార్థిని

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్24: పిప్రి జడ్పీ హెచ్ఎస్ విద్యార్థిని జయశీల రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విశ్వనాథ్ మంగళవారం తెలిపారు. ఈనెల 27 నుంచి 31 వరకు వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-I, Dist. Nizamabad agreed to accord Loan to Borrower: **Ateeq Ur Rahman** S/o. Habeeb Ur Rahman, Age: 34 Yrs, Occ: Business, R/o.H.No.9-4-113, Quilla Road, Nizamabad mortgage of the schedule referred property of **Farhat Zareena** (Co-Borrower). The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

Existing (G+1) storied RCC Roof building bearing Old Municipal Number (9-4-311/51/1, 2) and New Municipal No.9-4-113 situated at Barkatpura, Quilla Road, Nizamabad within the Municipal Corporation limits Nizamabad Registration Sub District and Registration District Nizamabad.

Total Area: 478.33 Square Yards or 399.93 Square Meters Plinth areas RCC Roof Ground Floor 2347.01 Square feet, First Floor 2347.01 Square Feet

Bounded by: North: House of Waheed Ahmed Baig and Fazil Khan, **South:** House of Baba Goud, **East:** 20'-0" Wide Road, **West:** Open Plot of Sadruddin and others

Sd/- R.JAGADISHWER RAO, Advocate Subhashnagar, Nizamabad, Cell: 9848094409

రైతులు, కూలీలను దగా చేస్తున్న ప్రభుత్వాలు

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సభ్యుడు ప్రభాకర్

కమ్మర్‌పల్లిలో విలేకరులతోమాట్లాడుతున్న వి.ప్రభాకర్

మోర్తాడ్, డిసెంబర్ 24: ఎన్నికలకు ముందు కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రైతులు, కూలీల విషయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వారిని దగా చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటరీయేట్ సభ్యుడు వి.ప్రభాకర్, రాష్ట్రనాయకుడు రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ సాగు చట్టాలను రద్దు చేస్తామని చెప్పి విస్మరించారని అన్నారు. ఢిల్లీలో రైతాంగ పోరాటంతో పంటలకు కనీసమద్దతు ధర చట్టం చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధిహామీ పథకంలో పని దినాలను తగ్గించి కూలీల పొట్టకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వందరోజులు పనిచేసిన వారికే భృతి ఇస్తామని చెప్పడం కూలీలను విస్మరించడమేనన్నారు. ఇప్పటికైనా రైతులు, కూలీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సురేశ్, కిషన్, రమేశ్, సత్తెక్క, రాజేశ్వర్, నరేందర్, దామోదర్, రమేశ్, అనీస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ బస్టాండ్‌లో కేక్ కట్‌చేస్తున్న డిపో మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది

నారాయణపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

బోధన్/నవీపేట, డిసెంబర్ 24: బోధన్ ఆర్టీసీ బస్టాండ్‌లో బోధన్ డిపో ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, ప్రయాణికుల సమక్షంలో క్రిస్మస్ కేక్‌ను డిపో మేనేజర్ శ్రీనివాస్ ఆర్టీసీ సిబ్బంది, క్రైస్తవ ఫాదర్లతో కలిసి కేక్ కట్‌చేశారు. బోధన్ డిపో ఏఈ శ్రావణ్, ఎస్‌టీఐ లక్ష్మణ్, సూపర్‌వైజర్లు, ఫాదర్లు బ్రదర్ అనంతయ్య చౌదరి, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు. నవీపేట మండలంలోని నారాయణపూర్, అభంగపట్నం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారుల మధ్య కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు

వేల్పూర్/రెంజల్, డిసెంబర్ 24: జిల్లాలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు చర్చిలను మంగళవారం ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చిల్లో ప్రార్థన చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వేల్పూర్ మండల కేంద్రం, రెంజల్ మండలంలోని నీలా క్యాంప్, వీరన్న గుట్ట, బాగేపల్లి, కూనేపల్లి, తాడ్‌బిలోలి, దూపల్లి గ్రామాల్లో చర్చిలను ముస్తాబు చేశారు.

వేల్పూర్‌లో ముస్తాబైన చర్చి

నీలా క్యాంప్‌లో విద్యుత్ దీపాలతో అలంకరించిన మరియరాణి చర్చి

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★నేను దొంగమట్టి సృజన్ తండ్రి నర్సయ్య ని॥ ఇ.నెం.2-112/1, కొటార్మూర్, ఆర్మూర్, నిజామాబాద్ నా యొక్క పాస్‌పోర్ట్ నెం. W2992796 గలది తేది: 29-11-2024న ఆర్మూర్ నుండి పెర్కిట్‌కు బైక్ పై ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. ఎవరికైన దొరికినవారు సంప్రదించు సెల్: 90306 07949

NTZ-338362

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పెరియార్ రామస్వామికి నివాళి

మోర్తాడ్, డిసెంబర్ 24: మండల కేంద్రంలో దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పెరియార్ రామస్వామి నాయకర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ..అన్ని కులాల సమాన హక్కుల కోసం, సాంఘిక సమానత్వం కోసం ఉద్యమాలు నిర్వహించిన సాంఘిక సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంక్షేమసంఘం అధ్యక్షుడు మల్లూరి రాజారాం, జాంభవ, ప్రతిక్, శ్రీనివాస్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ నీరు పట్టించాలి

చౌట్‌పల్లి నర్సరీలో బెడ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మోర్తాడ్, డిసెంబర్ 24: నర్సరీల్లోని బెడ్లపై ప్రతిరోజూ నీరు పట్టించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్, చౌట్‌పల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. నర్సరీల్లో ఎన్ని విత్తనాలు నాటారు, ఏయే విత్తనాలు నాటారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. వివరాలు తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి శాంతికుమార్ ఉన్నారు.

కిసాన్‌నగర్‌లో కంటి వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు ప్రవళిక

బాల్కొండ, డిసెంబర్ 24: కిసాన్‌నగర్‌లోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం మండల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు ప్రవళిక 40 మందికి పరీక్షలు నిర్వహించారు. మోతిబిందు ఉన్న వారిని గుర్తించి శస్త్ర చికిత్స కోసం ఆర్మూర్ లయన్స్ దవాఖానకు పంపించారు. క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, లయన్స్ బాధ్యులు దినేశ్‌బాయ్ పటేల్, వంశీరెడ్డి, ప్రసాద్, భోజారాం పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

భీమ్‌గల్, డిసెంబర్ 24: ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ తేదీని ఈనెల 30 వరకు పొడిగించినట్లు మండల విద్యాధికారి, సెంటర్ కోఆర్డినేటర్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలో చదువు మానేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 10వ తరగతిలో ప్రవేశానికి 14 ఏండ్లు, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి 15 ఏండ్లు నిండి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30 లోగా అడ్మిషన్లు పొందాలని సూచించారు. వివరాలకు 94915 34015 నంబరులో సంప్రదించాలని కోరారు.

మేకపై చిరుత దాడి

చిరుత దాడిలో గాయపడిన మేక

నందిపేట్, డిసెంబర్ 24: మండలంలోని చౌడమ్మ కొండూర్ శివారులోని గుట్టపై మేతకు వెళ్లిన ఓ మేకపై మంగళవారం సాయంత్రం చిరుత పులి దాడి చేసి గాయపర్చింది. చౌడమ్మ కొండూర్‌కు చెందిన పోతన్న తన కొడుకు దేవీదాస్‌తో కలిసి వారి మేకల మందను రోజు మాదిరిగా గుట్ట ప్రాంతానికి మేతకు తీసుకెళ్లారు. పొద్దుపోయాక ఇంటికి తిరిగి వస్తుండగా చిరుత ఒక మేకపై దాడి చేసి గొంతును పట్టేసింది. మేక అరుపులు గమనించిన తండ్రీ కొడుకులు కర్రలు చేతబట్టి అరుపులతో బెదిరించారు. దీంతో చిరుత మేకను వదిలిపెట్టి వెళ్లిపోయింది. నాలుగు రోజుల క్రితం రాత్రి సమయంలో అదే గుట్ట ప్రాంతంలో చిరుతను గమనించిన ఉమ్మెడ గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి పాదముద్రలను పరిశీలించి అది చిరుత కాదు.. అడవి పిల్లి అని నిర్ధారణకు వచ్చారు. మేకపై జరిగిన దాడి ఘటనతో చిరుతపులి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు తెలుస్తున్నది. అటవీ శాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి చిరుతను పట్టుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ వైద్యశాలలను వినియోగించుకోవాలి

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 24: ప్రభుత్వ దవాఖానల సేవలు ప్రజలు ఉపయోగించుకోవాలని మండల వైద్యాధికారి రవీందర్ సూచించారు. డాక్టర్ రవీందర్ చేసిన సేవలను అభినందిస్తూ యువకులు, నాయకులు కలిసి మంగళవారం దవాఖానలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రవీందర్‌కు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఏడేండ్లుగా ఎందరికో వైద్య సేవలు అందించడంతో పాటు దవాఖానలో పచ్చదనం, పరిశుభ్రతకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు జక్కం బాలకిషన్, కాటిపల్లి నర్సారెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గంగారెడ్డి, తలారి సతీశ్, బంగ్లా వసంతరావు, జితేందర్‌నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఎక్కడ?

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్24: ప్రధాని నరేంద్ర మోదీ గతంలో ప్రకటించిన పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారని ఎంపీ అర్వింద్‌ను తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు పసుపు బోర్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు.

31న ఎన్టీఆర్ అభిమానుల సమావేశం

బోధన్, డిసెంబర్ 24: దివంగత సీఎం ఎన్‌టీ రామారావు అభిమానుల సమావేశం ఈ నెల 31న సాయంత్రం 4 గంటలకు బోధన్ పట్టణంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని రాకాసిపేట్ అయ్యప్పస్వామి కమాన్ ఎదురుగా ఉన్న బొబ్బ శ్రీనివాస్‌రావు గృహంలో సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్టీయార్ అభిమానులంతా హాజరుకావాలని సంఘం సభ్యులు కోరారు.